క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో నర్సుకు గాయాలు

పెనమలూరు: కానూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్టాఫ్‌నర్సుకు గాయాలు అవ్వటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ గుణదలకు చెందిన వెలమర్తి కీర్తి కానూరు కామినేని ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తోంది. ఆమె విధులు పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లటానికి ఆటో ఎక్కింది. అయితే 100 అడుగుల రోడ్డులో పొక్లయినర్ రోడ్డు పనులు చేస్తుండగా ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటోనడిపి రోడ్డు పక్కనే ఉన్న పొక్లయినర్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆటోలో ఉన్న కీర్తి పడిపోవటంతో ఆమెకు గాయాలు అయ్యాయి. ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

పెనమలూరు: తన భార్య కనబడటంలేదని భర్త ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు అజయ్‌నగర్‌కాలనీకి చెందిన కందుల రాము ఆటోడ్రైవర్‌గా పని చేస్తాడు. అతనికి భార్య నవ్యశ్రీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య నవ్యశ్రీ కానూరు అనుమోలు హోమ్ ఫుడ్స్‌లో పని చేస్తుంది. కాగా ఈ నెల 28వ తేదీన నవ్యశ్రీ పనికి వెళ్లింది. భర్త రాము భార్య టిఫిన్ తిందా లేదా అని హోమ్‌ఫుడ్స్‌కు ఫోన్ చేయగా పనికి రాలేదని యాజమాన్యం తెలిపింది. దీంతో భర్త హోమ్‌ఫుడ్స్ వద్దకు వెళ్లి చూడగా భార్య నవ్యశ్రీతో పాటు అక్కడే పని చేస్తున్న దుంగల ఉమాదేవి కూడా కనిపించలేదు. ఇద్దరూ కలిసి ఎక్కడికో వెళ్లి పోయారని భర్త రాము పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ఓవర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో పలు వాటర్ ట్యాంకులను ఆదివారం పారిశుద్ధ్య సిబ్బందిచే శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో సురక్షిత తాగునీరు సరఫరాలో భాగంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇస్తున్నట్లు వివరించారు. ఈ వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాగునీటి పైప్‌లైన్ల విస్తరణ, ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో మోటారు బోర్లు ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

కంకిపాడు: ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీలను సమర్థంగా అమలుచేయాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈడుపుగల్లు గ్రామంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చిన్నా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలుచేయాలని ప్రభుత్వానికి సూచించారు. జూలై 1వ తేదీ నుంచి సామాజిక పింఛన్లు ఇంటింటికీ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం సంతోషకరమన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని కోరారు.

ప్రజలకు అండగా ఉద్యోగులు ఉండాలి



పెనమలూరు: ప్రజలకు అండగా ఉద్యోగులు ఉండి పని చేయాలని మంగళగిరి–తాడేపల్లి మునిసిపాలిటీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. తాడిగడప మునిసిపాలిటీలో ప్లానింగ్ అధికారిగా పని చేస్తున్న యార్లగడ్డ పద్మావతి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం రాత్రి కానూరులో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేడు నగరాలు విస్తరిస్తున్నందున టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్ర అభివృద్ధిలో చాలా కీలకమన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉద్యోగులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు మురళీగౌడ్, గిరి, మేనేజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.







శరణు శరణు.. శాంభవి

ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. శరణు శరణు.. శాంభవి అంటూ భక్తులు అమ్మ వారిని కొలిచారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

యజమాని సంతకం లేకుండా కౌలు కార్డులివ్వాలి



ఎమ్మెల్యే బోడెప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘ నేతలు

పెనమలూరు: భూ యజమాని సంతకం లేకుండానే కౌలు రైతులు కౌలు కార్డులు జారీ చేయాలని కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే బోడెప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి వివరాలు తెలిపారు. కౌలు రైతులు అనేక సంవత్సరాలు పోరాడి సాధించిన 2011 కౌలు రైతు చట్టాన్ని రద్దు చేశారన్నారు. దీని కారణంగా భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇస్తున్నారన్నారు. భూ యజమానులు సంతకం పెట్టడానికి ముందుకు రాకపోవటంతో కౌలు రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. రైతుభరోసా, ఈ–క్రాప్, పంటల బీమా, పంట నష్టపరిహారం, బ్యాంకు రుణాలు ఏవీ కౌలు రైతులకు అందటం లేదన్నారు. గతంలో లా భూ యజమాని సంతకం లేకుండానే కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. నేతలు మాదు నాగేశ్వరరావు, పెదపూడి శ్రీనివాసరావు, వి.మరియదాసు, ఉప్పాడ త్రిమూర్తి, కె.రాంబాబు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు



కంకిపాడు: అనుమోలు వంశస్తుల వంశోధామ్ కార్యక్రమం గోసాలలోని కోనేరు వృద్ధాశ్రమంలో ఆదివారం ఉత్సాహంగా సాగింది. విద్యలో ప్రతిభ చాటుతున్న 30 మంది విద్యార్థులకు అనుమోలు వంశోధామ్ తరఫున ఒక్కొక్కరికీ రూ.20వేల చొప్పున మొత్తం రూ. 6లక్షలు ఉపకార వేతనాలను చెక్కుల రూపంలో అందించారు. కార్యక్రమంలో అనుమోలు వంశస్తులైన ప్రభాకర్‌రావు, సత్యనారాయణ, హరి, నవీన్, గోసాల మాజీ సర్పంచ్ కోనేరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డుపై చెత్త కుప్పల తొలగింపు



పొక్లయినర్‌తో చెత్తను వెనక్కి నెడుతున్న దృశ్యం

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు వద్ద గన్నవరం –ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా చెత్త నిల్వలు భారీగా పేరుకుపోతున్నాయి. చెత్తచెదారం రోడ్డుపైకి చేరడంతో వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. దీనికితోడు వర్షాలకు కుళ్లిన చెత్త నుంచి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండటంతో అటుగా వెళ్లాలంటేనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ అనధికార చెత్త డంపింగ్ యార్డుపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో గ్రామపంచాయతీ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో పొక్లయిన్‌తో రోడ్డుపైకి చేరిన చెత్త నిల్వలను వెనక్కి నెట్టించారు. స్థానిక కోనాయి చెరువు నుంచి శ్మశాన వాటిక వరకు రోడ్డుపై చెత్తను క్లియర్ చేశారు. దుర్వాసన వెదజల్లకుండా బ్లీచింగ్, సున్నం చల్లించారు. చెత్త డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో తెలిపారు.

పేదరిక నిర్మూలనే ‘లయన్స్’ ధ్యేయం



మాట్లాడుతున్న లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శంకర్ గుప్తా

ఉయ్యూరు: సమాజంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలను చేపడుతోందని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జీఎస్ శంకర్ గుప్తా అన్నారు. లయన్స్ అధికారిక పర్యటనలో భాగంగా ఉయ్యూరులో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శిరీషా మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు ఆట వస్తువులు, యువతకు క్రికెట్ కిట్లు, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, పేద విద్యార్థికి సైకిల్, మహిళకు కుట్టు మిషన్ అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో శంకర్ గుప్తా మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సమాజ అభ్యున్నతే ధ్యేయంగా సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు నూకల వెంకట సాంబశివరావు, చెన్నారెడ్డి, చక్రధర్, రామకృష్ణ, బండి జ్యోతి, నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

టీటీడీకి గోదానం చేసిన మండవ



గన్నవరం: తిరుమల తిరుపతి దేవస్థానానికి గన్నవరానికి చెందిన మండవ వెంకటప్రభాకరరావు గోదానం చేశారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి గన్నవరం, విజయవాడ తూర్పు ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గద్దె రామ్మోహన్‌రావు హాజరయ్యారు. పూజ కార్యక్రమాలు అనంతరం ఎమ్మెల్యేల చేతుల మీదుగా గోమాతను టీటీడీ ప్రతినిధులకు అందజేశారు. తొలుత యార్లగడ్డ, గద్దెను సత్కరించడంతో పాటు వేద పండితుల ఆశీర్వాదాలు అందించారు. జెడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



పెనమలూరు: యోగా చేయటం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని శ్రీ వేంకటేశ్వర యోగా సేవ కేంద్రం గురువు ఆతుకూరి వెంకటేశ్వర యోగి అన్నారు. పెనమలూరు సెంటర్ కిలారు అనీల్‌ఎస్టేట్‌లో ఆదివారం 59వ ఉచిత యోగా శిక్షణ ముగింపు, 60వ ఉచిత యోగా శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయటం వల్ల ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు. ఆహారం తీసుకున్నంత కాలం ఆసనాలు వేయాలని, ప్రాణం ఉన్నంత కాలం ప్రాణాయామం చేయాలని అన్నారు. ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యథాసక్తి గురాజీ, మునిజనవంధితయోగి, ప్రభుదాసయోగి, చంద్రకళ యోగి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు



మాణిక్యాలరావుకు జ్ఞాపికను అందజేస్తున్న లక్ష్మణరావు

గన్నవరం: అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక రాయ్‌నగర్ కల్యాణ మండపంలో ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కె. మాణిక్యాలరావుకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో 34 ఏళ్లు పనిచేసిన మాణిక్యాలరావు ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని తెలిపారు. ఆయన రూపొందించిన సైన్స్ ప్రయోగాలకుగాను జిల్లా నుంచి జాతీయ స్థాయిలో అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం మాణిక్యాలరావు దంపతులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లెనిన్‌బాబు, కోశాధికారి మరీదు వరప్రసాద్, ఎంఈఓలు సురేష్‌కుమార్, సాంబశివరావు, మాజీ ఎంఈఓ జయబాబు పాల్గొన్నారు.

ముదునూరులో ఉచిత వైద్య శిబిరం



ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. గ్రామ పంచాయతీ, విజయవాడ సెంటినీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని స్థానికులు మువ్వా జ్ఞానశేఖర్, పాలడుగు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పల్లపోతు శ్రీనివాసరావు ప్రారంభించారు. శిబిరంలో 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గుండె, 2డీ ఎకో, ఈసీజీ, సుగర్, బీపీతో పాటు ఇతర సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్న వయస్సు వారు సైతం గుండె సంబంధిత వ్యాధితో ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితుల్లో సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సలహాలు పాటించాలని, ఆహార అలవాట్లు మార్చుకోవాలని డాక్టర్ శ్రీపతి సూచించారు. వ్యాయామంతో ఆరోగ్యంగా జీవించొచ్చన్నారు.

ఎడతెరపి లేని వాన



కంకిపాడు: అవర్తన ద్రోణి ప్రభావంతో ముసురు పట్టేసింది. ద్రోణి కారణంగా ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. రెండు రోజులుగా నానుడు వాన పడటంతో ఇళ్లల్లో నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కూడా మోస్తరు వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా వాన పడుతూనే ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండల కేంద్రమైన కంకిపాడు సహా పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. రహదారులు, రోడ్డు మార్జిన్‌లలో నీరు నిలిచిపోవటంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు ప్రాంగణం చెరువును తలపిస్తోంది.

రాయ్‌నగర్‌లో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ



రాయ్‌నగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లో అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్లు పూడుకుపోయి మురుగు నీటి పారుదల సక్రమంగా జరగడం లేదు. ఫలితంగా ఇటీవల కురిసిన వర్షాలకు నీరు రోడ్లపైకి చేరడంతో ప్రజల రాకపోకలకు అంతరాయంగా మారింది. దీనికితోడు ఇళ్లలోని మురుగునీరు కూడా చేరడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని ప్రజానీకం వాపోతున్నారు. మురుగునీటి పారుదల లేక అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో పాటు పందుల సంచారం పెరగడంతో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైన పంచాయతీ పాలకవర్గం స్పందించి డ్రెయిన్లలో పూడికలు తొలగించి మురుగునీటి క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



నున్న(విజయవాడరూరల్): జోరుగా వర్షాలు కురుస్తుండటంతో నున్న గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అవుట్ ఫాల్ డ్రెయిన్స్‌లో సిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. వర్షం నీరు అవుట్ ఫాల్ డ్రెయిన్స్‌లో చేరుకోవడంతో కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ వల్ల మురుగునీరు ముందుకు వెళ్లడం లేదు. దీంతో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తి మేరకు గ్రామ పంచాయతీ పొక్లయిన్లను పెట్టి కాలువలను వెడల్పు చేస్తున్నారు. విజయవాడ–నూజివీడు ఆర్‌అండ్‌బీ రహదారిలో డీమార్ట్, సెయింట్ జోసెఫ్ హైస్కూల్ రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్లలో గడ్డి తొలగింపు, వ్యర్థాల తొలగింపు పనులు చేస్తున్నారు. అలాగే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న గొల్లపూడి–ముస్తాబాద్ పంట కాలువను అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలువ కట్టలను అభివృద్ధి చేయడంతో పాటు చానెల్, సబ్‌చానెల్ మరమ్మతుల పనులు చేయాలని రైతులు కోరుతున్నారు.

నేడు కొత్తపేట నుంచి పింఛన్ల పంపిణీ

గన్నవరం: స్థానిక కొత్తపేటలో సోమవారం ఉదయం 6 గంటలకు నియోజకవర్గ స్థాయిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈ. సత్యకుమార్ ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్ని లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు. మండలంలోని మొత్తం 11,347 మంది లబ్ధిదారులకు రూ. 7.70 కోట్లు నగదును సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు పింఛన్ పంపిణీ..

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు. బాపులపాడు మండలంలో 11,956 సామాజిక ఫించన్లు ఉన్నాయని, వీరికి సుమారు రూ.8 కోట్ల మేర పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జూలై నెలకు పెన్షన్ రూ.4 వేలతో పాటుగా గత మూడు నెలలకు కూడా పెంచిన పెన్షన్ కలిపి మొత్తం రూ.7 వేలు చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు.